


## తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శుభం భన్సల్



తిరుపతి కార్పొరేషన్, జులై 24, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా బుధవారం ఉదయం 2020 బ్యాచ్ ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన శుభం భన్సల్ జిల్లా కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారు కొలువైన తిరుపతి జిల్లాలో జెసిగా పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను సమర్ధవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. జెసిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ జయరాములు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు నూతన జెసికి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు సహకార సంస్థకు టమోటా ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు : కలెక్టర్



రామకుప్పం, జూలై 24 ప్రభాతవార్త

మండలంలోని చెల్దిగానిపల్లిలోని రైతు సహకార సంస్థకు టమోటా ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కోసం కడ పిడి వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశ మయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 8.42కోట్లతో ప్రభుత్వం టమోటా రైతుల కోసం వందశాతం ఆర్థికసాయంతో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తుందని దీన్ని సంస్థ నిబద్ధతతో నిర్వహించి రైతులకు మేలు చేయాలన్నారు. నాణ్యత పర్యవేక్షణకు కడ నుంచి ఇంజనీర్లు, ఇతర శాఖలనుంచి ఇద్దరు సభ్యుల్ని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో డిహెచ్ఓ మధుసూధన్‌రెడ్డి, ఎడి కోటేశ్వరరావు, హెచ్ఓ డింపుప్రియశ్రీ, రైతు సొసైటీ అధ్యక్షుడు ఉమాపతి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# తల్లీకూతుళ్ళు దారుణహత్య







### ఆపై మరిది ఆత్మహత్య
### మంటగలిసిన మానవత్వం

తిరుపతి, జులై 24ప్రభాతవార్త:

తిరుపతి నగరంలో బుధవారం రాత్రి దారుణం జరిగింది. వదినె, ఆమె ఇద్దరు పిల్లలను హత్యచేసి ఆపై మరిది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన తిరుపతి యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలోని పద్మావతినగర్‌లో చోటుచేసుకోవడంతో సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో కలకలం రేపింది. సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, డిఎస్పీ రవిమనోహర చారి, యూనివర్సిటీ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. హత్యకు గల కారణాలను స్థానికుల నుండి సేకరిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.....పద్మావతినగర్‌లో తిరుమలదాసు ట్యాక్సీ నడువుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య సునీత(40), దేవిశ్రీ(13),నీరజ(10) ఉన్నారు. కుటుంబంతో కలసి పద్మావతినగర్‌లోనే ఉంటున్నాడు. ఇద్దరు పిల్లలు స్థానికంగానే పాఠశాలలో చదువుకుంటున్నారు. బుధవారం సాయంత్రం పాఠశాల నుండి తీసుకువచ్చి ఇంట్లో వదలివెళ్ళాడు. అతని సొంత తమ్ముడు టిజిమోహన్ చెన్నైలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 2019లో ఓ యువతితో ఇష్టంలేని పెళ్లి చేశాడు. అప్పటి నుండి అన్న దాసుపై వ్యక్తిగతంగా కక్షపెట్టుకున్నాడు. ఎలాగైనా అన్న కుటుంబాన్ని హతమార్చాలని పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో తరచూ కుటుంబంలో కలహాలు జరిగేవి. బుధవారం సాయంత్రం కూడా ఇంటికి వచ్చిన మోహన్ అన్నపై కక్షతో వదినెతో గొడవపడ్డాడు. మాటామాటా పెరగడంతో ఉన్నఫళంగా కత్తితీసుకుని వదినె తలపై నరికాడు. ఆపై ఇద్దరు పిల్లలను దారుణంగా చంపేశాడు. ముగ్గురూ ఒకేసారి రక్తపుమడుగులో పడిపోయారు. అతనుకూడా ఇంట్లో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంకా కుటుంబతగాదాల కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. తిరుపతి డిఎస్పీ రవిమనోహర చారి ఆధ్వర్యంలోయూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాసు ఇంటికి చేరుకునేలోపు దారుణం జరిగింది. తిరుపతినగరంలో జనం భయంతో వణికిపోతున్నారు. నాలుగురోజుల క్రిందట నగరంలోని రాయల్‌నగర్‌లో ఓ మహిళను చంపి, మరో ముగ్గురిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మరచిపోకముందే ఈ దారుణం జరగడంతో తిరుపతిలో హత్యల కలకలం భయంగోల్పిస్తోంది.

### చంద్రయాన్-3 విజయంతో
# ఇస్రోకు విశ్వవ్యాప్త కీర్తి

**షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్**
**గుంటూరులో మొదలైన చంద్రయాన్-3 ఏడాది విజయోత్సవాలు**





గుంటూరులో అంతరిక్ష కార్యక్రమాలు ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్, చంద్రయాన్-3 విజయోత్సవాల కార్యక్రమం

శ్రీహరికోట (తడ), జూలై 24 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా విశ్వవ్యాప్తంగా కీర్తి పొందిందని, ఆ స్ఫూర్తితో మరిన్ని ప్రతిష్టాత్మక ప్రయోగాలకు శ్రీకారంచుట్టామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. ఇస్రో ఆధ్వర్యంలో చంద్రయాన్-3 ప్రయోగం పూర్తయి ఏడాది కావడంతో దేశంలో పలుచోట్ల విజయోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గుంటూరులోని ఆర్‌విఆర్ అండ్ జెసి కాలేజిలో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న షార్ డైరెక్టర్ ఇప్పటిదాకా భారత్ సాధించిన అంతరిక్ష ప్రయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన బ్రోచర్ విడుదల చేశారు. ఇస్రో చంద్రయాన్-3 తర్వాత ఎన్నో పరిశోధనలు పూర్తి చేసిందని, ఇటీవల షార్ నుంచి ప్రయోగించిన అనేక రాకెట్లు విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లాయని, పరిశోధనలు, భూస్థిర పరీక్షలు సైతం విజయవంతం అయ్యాయని చెప్పారు. ఆగస్టు 23న నేషనల్ సైన్స్‌డేను జరపాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించిన తర్వాత ఈ ఏడాది ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు పలుచోట్ల నిర్వహిస్తున్నట్లు రాజరాజన్ చెప్పారు. విశ్వవిద్యాలయ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇస్రో విజయాలపై కొన్ని మరపురాని సంఘటనలతో ఎగ్జిబిషన్ వంటివి ఏర్పాటు చేశారు.

### వినాయకపురంలో
## ఒంటరి ఏనుగు దాడులు

ఐరాల, జూలై 24 ప్రభాతవార్త:





మండలంలోని ఐరాల పంచాయతీ వినాయకపురం గ్రామ సమీపంలోని పంటపొలాలపై ఒంటరి ఏనుగు మంగళవారం రాత్రి దాడుల చేసి పలువురు రైతులకు చెందిన పంట పొలాలను ధ్వసం చేశాయి. మండలంలోని వినాయకపురం సమీపంలోని అటవీ ప్రాంతం నుండి ఒంటరి ఏనుగు మంగళవారం రాత్రి వినాయకపురం పరిసరాలకు చేరుకుని పంటలపై దాడులు చేశాయి. ఈసందర్భంగా వినాయకపురంకు చెందిన సాయిూశ్వరరెడ్డికి చెందిన కొబ్బరి, అరటి పంటలు, పెన్సింగ్ రాతి కూసాలు, మోహన్‌రెడ్డికి చెందిన బోరు పైపులు, మామిడిచెట్లు, రాతికూసాలు, వినయ్‌రెడ్డికి చెందిన రాతికూసాలు, మామిడిచెట్లు, అరగొండ ప్రతాప .సి.రెడ్డికి చెందిన ఉసిరి పంటను ఒంటిరి ఏనుగు ధ్వంసం చేసింది. ఈవిషయాన్ని రైతులు బుధవారం ఉదయం కనుగొని అటవీశాక అధికారులకు సమాచారం అందించారు. ఈమేరకు వారు సంఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టం అంచనా వేశారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ... సమస్యలు పరిష్కరించాలి

**పోలీసులకు ఎస్పీ సూచన**
**పుత్తూరు సబ్‌డివిజన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు**

పుత్తూరు, జూలై 24 ప్రభాతవార్త :

పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. బుధవారం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని డిఎస్పీ కార్యాలయంతో పాటు వడమాలపేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, వరదయ్యపాలెం తదితర పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్లలో సిబ్బంది పనితీరు సమీక్ష, జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో ఆత్మీయంగా, హుందాగా మాట్లాడాలని హితవు పలికారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదుదారులకు అండగా నిలబడాలన్నారు. సైబర్ నేరాలు, నకిలీ లోన్ యాప్‌ల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. స్టేషన్లలో పెండింగ్‌లో వున్న కేసులను సకాలంలో దర్యాప్తు చేసేందుకు అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. మహిళా సంబంధిత నేరాల పట్ల సత్వరం స్పందించి



వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

బాధితులకు సరైన న్యాయం చేయలన్నారు. పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని అప్పలాయిగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, నాగలాపురంలో శ్రీ వేదనారాయణస్వామి ఆలయం, సురుటుపల్లిలో శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయాలతో పాటు సదాశివకోన, కైలాసకోన, సద్దికూటి మడుగు వంటి జలపాతాలున్న పర్యాటక ప్రాంతాలు న్నందున భక్తులు, యాత్రికుల రద్దీని దృష్టిలో వుంచుకుని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని సమర్ధంగా అమలు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు ఆస్కారం లేకుండా విజిబుల్ పోలిసింగ్ ద్వారా పర్యాటకులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని తెలిపారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సిఐలు తరచూ గ్రామ స్థాయిల్లో పర్యటించి గ్రామ సభల ద్వారా తగాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని కేడీలు, పాతనేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా వుంచాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నేర నివారణకు ఇ-బీట్ వ్యవస్థను బలోపేతం చేసి పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డిఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు ఓబులేసు, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత

**నూతన కమిషనర్ నారపురెడ్డి మౌర్య**



తిరుపతి కార్పొరేషన్, జులై 24, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని నూతన కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో అధికారికంగా బాధ్యతలు సీకరించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని విభాగాల అధిపతులతో జరిగిన సమావేశంలో అన్ని విభాగాలకు సంబంధించిన విషయంపై చర్చించారు. అధికారులతో కమిషనర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధికి కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దామని సూచించారు. నూతన కమిషనర్ మౌర్యకు అధికారులు, సిబ్బంది, పలువురు కార్పొరేటర్లు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్ వర్మ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణారెడ్డి, మెప్మా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు



తిరుపతి విద్య, జులై 24, ప్రభాతవార్త

తిరుపతి - కరకంబాడి మార్గంలోని శ్రీరామఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపుని ఇస్తూ న్యూ ఢీల్లీ యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్శిటీ (జేఎన్టీయూ), అనంతపురం వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మన్నెం అరవింద్ కూమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలలో బోధనా కొనసాగిస్తున్నామని, క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఇప్పటికీ కొన్ని వేల మంది విద్యార్థులు వారి జీవితాలను సుస్థిరం చేసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిందని, ఇప్పుడు తమ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి గుర్తింపుకు కారకులైన కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డికి, కళాశాల సెక్రటరీ, మన్నెం రామ సుబ్బారెడ్డికి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్రకి, అధ్యాపక బృందానికి, విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## స్వర్ణరథంపై అలరించిన విఘ్ననాథుడు

కాణిపాకం, జూలై 24 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన విఘ్ననాథుడు సర్వాలంకృతుడై బంగారురథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ హస్తం అందించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు దఫాలుగా సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు కుటుంబం కంటే ప్రజలే ఎక్కువ

**కుప్పానికి ప్రత్యేక మేనిఫెస్టో అమలు - సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి**





సమావేశంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి , హాజరైన ప్రజలు

కుప్పం/కుప్పంరూరల్, జూలై 24 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రజల మనిషి అని ఆయనకు కుట్బుం కంటే ప్రజలే ఎక్కువ అని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండలంలోని ఎన్. కొత్తపల్లి, నడిమూరు, పైపాళ్యం, ఉర్ల ఓబనపల్లి, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా పైపాళ్యం గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా ప్రజలు, మహిళలనుద్దేశించి నారా భువనేశ్వరి మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి వదిలేసి దొరికినంతా దోచుకున్నారన్నారు. నేడు వైకాపా చేసిన దోపిడీ ఫైళ్లు బయటపడుతున్నాయని వీటిని సరిదిద్ది చంద్రబాబు అభివృద్ధి తీసుకువచ్చేందుకు కొంత సమయం పడుతుందన్నారు. చంద్రబాబు చివరి నిమిషం వరకు ప్రజల కోసం కష్టపడతారన్నారు. బంగారుపాళ్యంలో కొళాయిలో నీరు రాలేదని చెప్పినందుకు వైకాపా పాలనలో ఆమె కళ్లు పీకేశారన్నారు. ఇలాంటి దుర్మార్గపు పనులకు పాల్పడ్డారన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో 83శాతం ఓట్లు పోలయ్యాయని ఇది వైకాపా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు ప్రత్యేక మేనిఫెస్టో అమలు చేస్తారన్నారు.

**ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకుంటున్న భువనమ్మ - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల**

కుప్పం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని ఎన్నికల సమయంలో నారా భువనమ్మ పేర్కొన్న విధంగానే నేడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. కుప్పం అభివృద్ధికోసం చంద్రబాబును నారా భువనమ్మ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్, భువనమ్మలు కుప్పం ప్రజలపై ప్రేమాభిమానాలు కురిపిస్తున్నారన్నారు. ఇటీవల ఏనుగు దాడిలో గాయపడ్డ నూలుకుంట కరిసిద్ధప్పకు అటవీశాఖ తరపున రూ.88,745ల చెక్కును నారా భువనమ్మ అందించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్,శాంతారాం, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సాంబశివ ం, ఎవి రవి, మహేంద్ర, కృష్ణ మూర్తి, సికెసుబ్రమణ్యం, సికెవిజయ్‌కుమార్, రామచంద్ర, వల్లెప్ప, వసంతమ్మ,సర్పంచులు మాదమ్మ, రాజశేఖర్‌లు



## ఇందిరమ్మ ఇళ్ళస్థలాలు ఆక్రమించేశారు...!

-ఇప్పించండి మహాప్రభో

ఆమినిగుంట(చౌడేపల్లి), జూలై 24 ప్రభాతవార్త



తరాలుగా అనుభవంలో వున్న ఇందిరమ్మ ఇళ్ళస్థ లాలను ఆక్రమించి లే-ఔట్లు ఏర్పాటు చేస్తున్నారనీ... ఆక్రమితదారుల చెర నుంచి కాపాడాలంటూ ఆమినిగుంట దళితులు వేడుకొంటున్నారు. బాధితుల కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంట దళితులకు 1983, 1995లో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసి గ్రామానికి సమీపంలో స్థలాలిచ్చారని తెలిపారు. పెద్దకొండామర్రి రెవిన్యూ పైకి 741-2, 744-2సర్వేనంబర్లలో 18మందికి 02.5సెంట్ల చొప్పున పంపిణీ చేసారన్నారు. అయితే ఆయా స్థలాల్లో కొందరు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టగా మరికొందరు గుడిసెలు నిర్మించుకొన్నామనీ, అప్పట్లో కురిసిన వర్షాలకు ఇళ్ళు కూలిపోగా, గుడిసెలు మొరవలో కొట్టుకుపోయాయని పాపులమ్మ తెలిపింది. గ్రామానికి దూరంగా స్థలాలుండటం, మౌళిక వసతులు లేకపోవడంతో ఆమినిగుంటలోనే వుండి పోయామన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు వ్యక్తులు తమ స్థలాలను ఆక్రమించుకొని ఇతరులకు విక్రయించారనీ, వాటిలో ప్రస్తుతం రియల్టర్లు లే-ఔట్లు వేస్తున్నారని వాపోయారు. తమ స్థలాలు ఇప్పించాలని బాధితులు వారి వారసులు కోరుతున్నారు. కాగా 741. 744సర్వే నంబర్లలో ఆమినిగుంట దళితులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ళ స్థలాలను రెవిన్యూ అధికారులు చూపించాలని స్థానికులంటున్నారు.

## సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో విచారించి, పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, డయల్ యువర్ ఎమ్మెల్యే, కలెక్టరేట్ ఫిర్యాదులు తదితర ఫిర్యాదులను పరిష్కరిస్తున్న తీరు, ఎండార్స్‌మెంట్, రిపోర్టింగ్ తదితరాలపై సంబంధిత విభాగ అధికారులు, వార్డు కార్యదర్శులతో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ సమీక్షించారు. ఈ సమీక్షలో కమీషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులను 24 గంటల్లో క్షేత్ర స్థాయిలో విచారించి పూర్తి చేయాలని, సంబంధిత వార్డు కార్యదర్శులతో పాటు సంబంధిత అధికారులు అర్జీదారులను కలిసి సమస్యపై చర్చించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించి క్షేత్ర స్థాయి విచారణ, పరిష్కరించిన తీరు, అర్జీదారుడి ఫీడ్‌బ్యాక్ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ విషయంలో ఎక్కడ జాప్యం జరుగకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సహాయ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఎంఇ గోమతి, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేటి డయల్ యువర్ ఎమ్మెల్యే రద్దు

చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త:

చిత్తూరు నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నిర్వహించే డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం రద్దు అయ్యింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్ళడంతో ఈ వారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టడం లేదు. వచ్చే గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన పాలసముద్రం టిడిపి నేతలు

పాలసముద్రం, జులై 24 ప్రభాతవార్త:



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను బుధవారం పాలస ముద్రం మండల తెలుగుదేశం నాయకులు రాష్ట్ర రాజధాని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసునాయుడు, జిడినెల్లూరు నియోజకవర్గ వాణిజ్య విభాగ కార్యదర్శులు రవినాయుడు, బాలాజీనాయుడు కలిసి సన్మానించారు. జిడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వీరిని మంత్రి నారాలోకేష్ వద్దకు తీసుకెళ్ళి పరిచయం చేశారు. అలాగే వీరు సీనియర్ తెలుగుదేశం నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యాచౌదరిని సైతం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

## కుప్పంలో మామిడి ప్రాసెస్ యూనిట్‌కై భూములు కోరిన కెవిన్ సంస్థ

కుప్పం, జూలై 24 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకోసం తగు భూములు కేటాయించాలని కెవిన్ కేర్ సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొత్తగా మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కడ పిడి వికాస్ మర్మత్‌తో కలసి కెవిన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో వివిధ పరిశ్రమలు కలిగి ఇతర దేశాల్లో సైతం పరిశ్రమలు ఏర్పాటుచేసిన సంస్థ ఉత్పత్తుల గురించి 42 దేశాల్లో ఉన్న నెట్ వర్క్ గురించి సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో విరివిగా ఉన్న మామిడి నుంచి ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూమి కేటాయించాలని వారు కోరారు. దీనిపై కలెక్టరు స్పందించి రాష్ట్రస్థాయి ఉద్యోగులకు నివేదికలు అందించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## అతివేగం అనర్థాలకు మూలం : ఎస్ఐ

చౌడేపల్లి, జూలై 24 ప్రభాతవార్త



వాహనాలను అతివేగంగా నడపడం అనర్థాలకు మూల మని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లి-పుగనూరు మార్గంలోని బోయకొండ ఆర్చి వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్లను ధరించి ద్విచక్రవాహనాలను నడపాలన్నారు. వాహనదారులు రికార్డులను సక్రమంగా కల్గివుండాలన్నారు. ఆటోవాలాలు ఓవర్‌లోడ్‌తో ప్రయాణించరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడుగా

ఉమాపతి నాయుడు ఏకగ్రీవం

పలమనేరు,జూలై 24 ప్రభాతవార్త:

ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా ఉమాపతి నాయుడుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇటీవల బంగారుపాళ్యం మండలంలో జరిగిన మామిడికాయల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య సమక్షంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులుగా ఏ.ఉమాపతి నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడూతూ ఉమ్మడి జిల్లాల రైతులకు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను అధికారులతో దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

-సిఐ లింగప్ప

వి.కోట,జూలై 24,ప్రభాతవార్త:

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని సిఐ లింగప్ప తెలిపారు.వి కోట మండల కేంద్రంలో బుధవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు,నంబర్ ప్లేట్ లేని వాహనాలు,అధిక వేగం,మైనర్లు నడిపే వాహనాలును గుర్తించి వారి స్వాధీనంలోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.నిబంధనల మేరకు సంబంధిత వాహన యజమానులకు జరిమానాలు వసూలు చేశారు.ఈ మేరకు సిఐ లింగప్ప ప్రజలు మోటరు వాహనాల చట్టం,శిక్షలు,జరిమానాల గురించి తెలిపారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరి ధరించాలని సూచించారు.చట్టాలను ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని, మైనర్లకు తల్లితండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

## మంత్రి నాదెండ్లను కలసిన కూటమి నేతలు

పుంగనూరు, జూలై 24 ప్రభాతవార్త :



రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బుధవారం పుంగనూరు నియోజకవర్గ కూటమినేతలు కలసి పలు సమస్యలు సమర్పించారు. అమరావతిలో మంత్రి కార్యాలయంలో ఆయనను కలసిన రాష్ట్ర వాల్మీకి సంఘ అధ్యక్షుడు,తెలుగుదేశం నేత కనుమకుంట సుకుమార్‌బాబు, జనసేన కన్వీనర్ చిన్నారాయల్‌లు పుంగనూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను,పరిష్కరించాల్సిన విషయాలను మంత్రికి నివేదించారు. ఈసందర్భంగా మంత్రి పుంగనూరు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి స్వయంగా రానున్నారని, పుంగనూరు నియోజకవర్గంలో త్వరలో మంత్రుల పర్యటలను కూడా ఖరారు చేసే అవకాశాలున్నాయని స్పష్టం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పనిచేయని మంచినీటి చేతిబోరు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

అవస్థలు పడుతున్న గ్రామస్తులు

పాకాల, జులై 24 ప్రభాతవార్త



పాకాల మండలం దామలచెరువు రెవెన్యూ గ్రామం బందార్లపల్లెలో ఊరి ముందు ఉన్నటువంటి మంచి నీటి చేతి బోరు పంపు పనిచేయడం లేదు. గతంలోనే ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా పరిస్కారం దొరకలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చేతి బోరు పంపుని వెంటనే రిపేరు చేయాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

## 28న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

తిరుపతి క్రీడ, జులై 24, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా సంఘ ప్రధాన కార్య దర్శి డి. సుధీర్ తెలిపారు. ఎంపికైన జట్టు విజయవాడలో ఆగస్టు 4,5 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 28వ తేది ఉదయం 8 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపితో పాటునాలుగుపాస్‌పోర్ట్‌సైజ్‌ఫోటోలతోహాజరుకావాలనిపేర్కొన్నారు.ఎంపికల్లోపాల్గొనడానికి 2006లో జన్మించినవారుఅర్హులన్నారు.మరిన్నివివరాలకోసం9032270031మొబైల్‌నెంబర్‌కుసంప్రదించాలన్నారు.

## 7 ఎర్రచందనం దుంగలు స్వాదీనం

భాకరాపేట జూలై23ప్రభాతవార్త



చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట అటవీ రేంజ్‌లో బుధవారం ఏడు ఎర్రచందనం దుంగలు స్వాదీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి ఎం.దత్తాత్రేయ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు భాకరాపేట రేంజ్ నాగపట్ల ఈస్ట్ బీటులో ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు ఈతగుంట అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా ఎర్రచందనం దుంగలు మోసుకు వస్తున్న స్మగ్లర్లు ఎదురుపడ్డారు. అటవీ సిబ్బంది దాడి చేసి పట్టుకోవాలని ప్రయత్నించారు. ఈక్రమంలో స్మగ్లర్లు పారిపోయారు. పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పట్టుబడిన ఏడు ఎర్రచందనం దుంగలు 243 కిలోల బరువు ఉన్నాయని వాటి విలువ రూ.6లక్షల వరకు ఉండవచ్చునని ఆయన చెప్పా రు.ఈదాడులలోడిఆర్‌ఓ వేణు, ఎఫ్‌బీఓలు రవి, రెడ్డెప్పరెడ్డి, బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## ఇతరులకు సాయం చేసే గుణాలు పెంపొందాలి

సదుం, జూలై 23 ప్రభాతవార్త



చిన్నప్పటి నుంచి పిల్లల్లో ఇతరులకు సాయం చేసే గుణాలు పెంపొందించాలని మండల విద్యా శాఖాధికారి బి.శ్రీరాములు అన్నారు. బుధవారం మండల పరిధి లోని చింతపర్తివారిపల్లె మండల పరిషత్ ప్రాదమిక పాఠశాలలో ఏబీసీ వాలంటరీ ఆర్గనైజేషన్ తరపున శ్రీమతి సుమలత రూ.10వేల విలువచేసే విద్యాసా మాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి యేటా పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుమలతను ప్రశంశించారు. అలాగే పిల్లల్లో కూడా ఇతరు లకు సాయం చేసే గునాలు అలవరచకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో మంచి విద్యాభివృద్ధి పెంపొందాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, బలిజపల్లె, పిడికోవులవారిపల్లె పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, కిషోర్‌కుమార్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పట్టణ సమస్యలను పరిష్కరించండి

పురపాలక కమిషనర్‌కి టిడిపి నాయకులు వినతిపత్రం

గూడూరు, జులై 24, ప్రభాతవార్త



గూడూరు పట్టణ పరిధిలోని నెలకొని ఉన్న ప్రధాన సమస్యలను గూడూరు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని మున్సిపల్ శాఖ కార్యాలయంలో టిడిపి నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గూడూరు ఎమ్మెల్యేగా స్థానిక సునీల్ కుమార్ విజయం సాధించడంతో గూడూరు నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించాలని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గూడూరు పట్టణ టిడిపి కమిటీ నాయకులు పట్టణ పరిధిలో పర్యటించి నెలకొని ఉన్న సమస్యలను గుర్తించారు. ఈ క్రమంలో పట్టణ టిడిపి నాయకులు గూడూరు పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వారు గుర్తించి ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య మీడియాతో మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు లేక ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణ పరిధిలో ఉన్న కాలువల్లో సిల్టు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలని, దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఇజ్రాయిల్ కుమార్, అబ్దుల్ రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సాయం చేయడమే మా లక్ష్యం

డాక్టర్ రోహిణి

గూడూరు, జులై 24, ప్రభాతవార్త



మనకు ఉన్నంతలో పేదలకు సేవా కార్యక్రమాలు చేసే మనస్తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో మాజీ ఇన్నర్ వీల్ క్లబ్ గూడూరు శాఖ అధ్యక్షురాలు జీవని తండ్రి వర్ధంతి సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ నేటి కార్యక్రమానికి దాతగా వ్యవహరిస్తున్న జీవని గత ఆరు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఇదే తరహాలో తమ క్లబ్‌ల్లో ఉన్న సభ్యులు పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనుజ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువాకి ఘన నివాళి

గూడూరు, జులై 24, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో గుర్రం జాషువా 53వ వర్ధంతి సభ బుధవారం గూడూరు కెవిపిఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ సభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జాషువా సమాజంలోని సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదురుకొన్నారని కొనియాడారు. యువత జాషువా ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్ యాదగిరి, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, సురేష్, పుట్టా శంకరయ్య, బివి రమణయ్య, రామిరెడ్డి, పామంజి మణి, బి. చంద్రయ్య, శేఖరాచారి, డాక్టర్ చంద్రహాస్, ఎంబెటి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు కోల్పోయిన బాధితురాలికి ఆర్థిక సాయం

చిల్లకూరు, జులై24, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలోని చింతవరం గ్రామంలో బొలిగి కోటమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు ఈనెల 20వ తేది కాలిపోయింది. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, తానంకి నానాజీ ఆదేశాల మేరకు బాధితురాలికి ఐదు వేల రూపాయిలు నగదు, నిత్యావసర సరుకులు, కూరగాయలను తహశీల్దారు శ్రీనివాసులు అందజేసారు. ఆయన వెంట విఆర్‌ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, రౌడీయిజాన్ని అరికట్టాలి

హోం మంత్రికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే

గూడూరు, జులై 24, ప్రభాతవార్త



అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హోమ్ మినిస్టర్ ఛాంబర్‌లో హోం మంత్రి వంగలపూడి అనితని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కలిసి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో రౌడీయిజం, గంజాయి, మత్తు పానియాల సరఫరాను అరికట్టాలన్నారు. లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన హోం మంత్రిని కోరారు. ఈయన వెంట నాయకులు వాటంబేడు శివకుమార్, గణపర్తి కిషోర్ నాయుడు, కేతం రెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గూడూరు, జులై 24, ప్రభాతవార్త



గంజాయిని కల్గిన వ్యక్తిని గూడూరు సెబ్ పోలీస్‌లు అరెస్టు చేశారు. గూడూరు పట్టణంలోని సెబ్ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో సెబ్ సిఐ రమేష్ మాట్లాడుతూ వాహనాల సాధారణ తనిఖీల్లో భాగంగా చిల్లకూరు మండల పరిధిలోని భూదనం టోల్ ప్లాజా వద్ద గంజాయి కలిగిన వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ఒడిశా రాష్ట్రంకి చెందిన నంద సాహు అనే వ్యక్తిగా గుర్తించామన్నారు. అతని వద్ద ఉన్న సుమారు ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతను చెన్నై ప్రాంతంలోని రెడ్‌హిల్స్ ప్రాంతంలోని హోటల్‌లో పనిచేస్తూ అక్కడ వ్యక్తులకు గంజాయిని అధిక ధరలకు విక్రయించడానికి తీసుకెళ్తున్నాడని తెలిపారు. అనంతరం కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది మోసెస్, విజయ్ కుమార్, కిరణ్ సింగ్, కృష్ణయ్య, ఆనంద్ బాబు, గౌస్ భాషా, రవి, రాం ప్రసాద్, నారాయణ, బాలవర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ ధర్నాకు అనూహ్య స్పందన

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, జులై 24, ప్రభాతవార్త



మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో చేసిన ధర్నాకు అనూహ్య స్పందన లభించిందని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ మద్దతు తెలపడంతో మరింత బలం చేకూరింది అని తెలిపారు. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖ నాయకులు జగన్మోహన్ రెడ్డి ధర్నాకు మద్దతు పలికారని తెలిపారు. రాష్ట్రాల జరుగుతున్న అరాచకాలు దేశ స్థాయిలో జనాధారణ తెలిసిందని తెలిపారు. ఢిల్లీ ధర్నాకు అనూహ్య స్పందన లభించిందని తెలిపారు.

## సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపిడిఓ

వాకాడు, జులై 24, ప్రభాతవార్త

మండల పరిధిలోని పలు సచివాలయాలను బుధవారం ఎంపిడిఓ ఐ. వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డు నిర్వహణకు పరిశీలించారు. విధులకు నిర్ణీత సమయానికి హాజరు కాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విధులకు హాజరైన సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయాల్లోనే ఉండాలని సూచించారు.

## అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన తొలి దళిత కవి గుర్రం జాషువా

వర్ధంతి సభలో మాట్లాడిన వక్తలు వెల్లడి

వెంకటగిరి, జులై 24, ప్రభాతవార్త



అట్టడుగు వర్గాల నుండి గుర్రం జాషువా వచ్చిన మహాకవి అని పలువురు వక్తలు తెలిపారు. గుర్రం జాషువా వర్ధంతి సభ బుధవారం పట్టణంలోని గ్రంథాలయంలో జరిగింది. ప్రజాసాహితి పాఠకులు ఆధ్వర్యంలో జరిగిన సభకు గుర్రాల రమేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ జాషువా మనల్ని వీడి 54 ఏళ్ల గడిచిపోయాయి. అయినా ఆయన పద్యాలు ప్రజలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో ఉన్నట్లు తెలిపారు. ప్రజలను ఆలోచింపచేసే రచనలకు, పద్య కవిత్వానికి ఎన్నో సన్మానాలు అందుకున్న జాషువా దళిత కుటుంబంలో పుట్టిన కారణంగా జీవిత చరమాంకం వరకూ ఎన్నో అవమానాలను కూడా ప్రత్యక్షంగా ఎదుర్కొన్నారని తెలిపారు. గాంధేయవాదిగా ఉన్న కుల మత వివక్షతలను ఎండగడుతూ అభ్యుదయ కవిగా పరిణితి చెందాడన్నారు. తన కవిత్వంలో శ్రమజీవులపై జరిగే దోపిడిని ప్రశ్నిస్తూ సామ్యవాదిలాగా వ్యవహరించారు. ఇదే రోజు గుర్రం జాషువా, ప్రజాసాహితి పూర్వ సంపాదకులు నిర్మలానందల వర్ధంతి, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి కావడంతో వీరికి నివాళులు తెలిపారు. ముందుగా వీరి జీవిత విశేషాలను గ్రంథాలయ నిర్వాహకులు ఎ. అంజయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో టి. లీలావతి, బికే. ప్రసాద్, పెనుమూక వేణు, వివి. రమణయ్య, సూర్యప్రకాష్, చింతపట్ల సాయిబాబా పాఠకులు పాల్గొన్నారు.

## పోలీసులచే తడ ఐటిఐలో అవగాహన కార్యక్రమం

తడ, జూలై 24 ప్రభాతవార్త



తడ ఐటిఐలో బుధవారం పోలీసులు యువకులకు డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమరవాణా, వాటిని సేవించడం యువత మానుకోవాలని లేదంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, మహిళలపై వేధింపులు మానుకోవాలని సూచించారు. కొన్ని కఠినమైన చట్టాల గురించి వివరించారు. సమాజంలో యువత పాత్ర కీలకమైనదని, ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సమాజ హితానికి అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప లువురు ఐటిఐ అధికారులు, టీచర్లు, యువకులు, ఐటిఐ సభ్యులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలు అందించి పుణ్యం కట్టుకోండి మహాప్రభో

చిట్టమూరు, జూలై 24 ప్రభాతవార్త

రబీ సమీపిస్తున్నా పచ్చిరొట్ట విత్తనాలు ఇంకా మండలానికి అందకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో అన్ని మండలాలకు నెలరోజులు ముందే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ జరిగినప్పటికీ నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు మాత్రం నేటికీ పచ్చిరొట్ట విత్తనాలు అందలేదని రైతులు చెప్తున్నారు. భూసారాన్ని గణనీయంగా పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలగ, పిల్లిపెసర, జనుము వంటి రకాలు రైతులకు ఎంతో అవసరమైనా అవి కార్యరూపం దాల్చకపోవడంతో రైతులు ఒకింత అసహనానికి గురవుతున్నారు. గతంలో భూసారాన్ని పెంచుకునేందుకు గేదె, ఆవు, గొర్రెల ఎరువులను పొలాలకు వినియోగించే వారు. ప్రస్తుతం సేంద్రియ ఎరువుల కొరత ఏర్పడటంతో రైతులందరు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలపై ఆధారపడి భూములు సాగు చేసుకుంటూ భూసారాన్ని పెంచుకుంటున్నారు. అధికారులు ఈ నెలలో అయినా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించి ఆదుకోవాలని చిట్టమూరు, కోట, వాకాడు మండలాల వారు కోరుతున్నారు.

## మేలుజాతి పశువులను అభివృద్ది చేయండి ...జెడి

దొరవారిసత్రం జూలై 24 ప్రభాతవార్త

గ్రామాల్లో మేలుజాతి పశువులను అభివృద్ధి చేయాలని తిరుపతిజిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రవికుమార్ రైతులను కోరారు.ఆయన ఆధ్వర్యంలో ఉచ్చూరు గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరంను బుధవారం అధికారులు నిర్వహించారు.అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడి రవికుమార్ మాట్లడుతూ గ్రామాల్లో రైతులు మేలుజాతి పశువులను అభివృద్ది చేయడం ద్వారా వాటిసంతానం క్రమేణ పెరుగుతుందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడలను పొందవచ్చున్నారు.ప్రతిరైతు పశుగ్రాసాలను పొలంలో పెంచుకోవాలని సూచించారు.రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయనతెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లాపశుగణాబివద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి సోమయ్య, పెళ్ళకూరు,నాయుడుపేట పశుసంవర్ధకశాఖ ఏడి ధనుంజయలు,గోవర్ధన్‌రెడ్డి,డాక్టర్ శ్రీదేవి, వైద్యసిబ్బంది, ఉచ్చూరు సర్పంచ్ వందవాసి పద్మమ్మ, మాజిసర్పంచ్ పామంజి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కుల విభజనకు వ్యతిరేకంగా

## ఉద్యమం నడిపిన కవి గుర్రంజాషువా

తిరుపతి టౌన్,జులై 24(ప్రభాతవార్త:



తన రచనలతో అంటరానితనం, దళిత హక్కులు ,కుల విభజనకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన గొప్ప కవి గుర్రం జాషువా అని రాయలసీమ రంగస్థలి కళాకారులు పేర్కొన్నారు. జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జాషువా జీవిత విశేషాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కేశవరెడ్డి,చంద్రబాబునాయుడు, మల్లారపు రవిప్రసాద్, కస్పా పద్మనాభం, ఫణిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో స్వయం ఉపాధి రుణపరిమితి పెంపు

-ఛార్టెడ్అకౌంటెంట్ భాగ్యతేజ

తిరుపతి టౌన్,జులై 24(ప్రభాతవార్త:



స్వయం ఉపాధికోసం ప్రయత్నిస్తున్న యువతకు ప్రోత్సాహకరంగా ఎలాంటి పూచీకత్తు అవసరం లేని ముద్రరుణాల పరిమితిని ఈ బడ్జెట్‌లో కేంద్రం పెంచిందని ఛార్టెడ్ అకౌంటెంట్ వి. భాగ్యతేజ తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ)తిరుపతి ఛాప్టర్ ఆధ్వర్యంలో న్యూబాలాజీ కాలనీలో వార్షిక బడ్జెట్ 2024పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భాగ్యతేజ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ముద్ర రుణాల పరిమితిని 10లక్షల నుండి 20లక్షల రూపాయలకు పెంచారన్నారు. రాష్ట్రానికి సంబంధించి అమరావతి రాజధాని నిర్మాణానికి 15వేల కోట్ల రూపాయలు అదేవిదంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి ఇంకా పలు ప్రాజెక్టులకు, పనులకు పునర్వ్యవస్థీకరణ కోసం నిధులు మంజూరుచేస్తామని కేంద్రం బడ్జెట్‌లో పేర్కొన్నారని వివరించారు. సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలు అందించారని వెల్లడించారు. పన్ను పరిధిలోకి వచ్చే వేతనజీవులకు శ్లాబులను మార్చడం ద్వారా ఏడాదికి 17,500రూపాయలు లబ్ధికలుగుతుందన్నారు. ఈ బడ్జెట్లో మార్కెట్లో నగదు ప్రవాహాన్ని పెంచేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. యుపిఐ చెల్లింపులద్వారా వచ్చే ఆదాయాన్ని బట్టి వ్యాపార సంస్థలను జిఎస్‌టి పరిధిలోకి చేర్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు. ఎస్‌పిఎప్ ఎస్పీ రామచంద్రరాజు, ఆకాశవాణి తిరుపతి కేంద్రం మాజీసంచాలకుడు డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, అధ్యాపకురాలు రచయిత్రి శశి తన్నీరు. పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్‌రావు, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, సహాయ కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్‌సికె రాజు, మధుసూదన్, రాజేశ్, మాజీ ఛైర్మన్లు డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఆచార్య త్రిపురసుందరి పాల్గొన్నారు.

## సంకటహర చతుర్థిన

వినాయకుడి పూజలతో అన్నీ శుభాలు-వరసిద్ధిఆలయ కమిటీ

తిరుపతి టౌన్,జులై 24(ప్రభాతవార్త:



సంకటహరచతుర్థశి సందర్భంగా బుధవారం సాయంత్రం వినాయకసాగర్‌లోని సంకల్ప వరసిద్ధి వినాయకస్వామిని పూజిస్తే అన్నీ శుభాలు కలుగు తాయని ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనా ధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిపి ఆనంద్ వాసు తెలిపారు. సంకట హరచతుర్థశి పురస్కరిం చుకుని బుధవారం సాయంత్రం వరసిద్ధివినాయకునికి ఆలయ కమిటీ ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. నేటి సమాజంలో భగవంతుని పూజలు,నామస్మరణతోనే అన్నీ శుభాలుకలుగుతాయని అన్నారు. స్వామివారికి చతుర్థశి ఎంతో ప్రీతిపాత్రమన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త కొండె చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, శాంతి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ కట్టడానికి వచ్చి ప్రమాదవశాత్తు పైనుండి పడి వ్యక్తి మృతి

శ్రీరంగరాజపురం, జులై 24 (ప్రభాతవార్త:



తమిళనాడు రాష్ట్రం రాణిపేట నుండి బతుకుతెరువు కోసం ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయడానికి వచ్చి ప్రమాదవశాత్తు ఎత్తు నుండి కిందికి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి కొత్తపల్లిమిట్టలో జరిగింది. వివరాలిలా వున్నాయి. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఎస్ఆర్‌పురం మండల పరిధిలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. తమిళనాడు రాష్ట్రం రాణిపేటకు చెందిన ఆ కాంట్రాక్టర్ అక్కడి నుండి కొంత మంది వ్యక్తులను కూలీ కోసం ఇక్కడికి రప్పించుకున్నారు. ఈ క్రమంలో కొత్తపల్లిమిట్టలో చిత్తూరు-పుత్తూరు రోడ్డుకు ప్రక్కన ఓ ప్రైవేటు స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడానికి కూలీలు సిద్ధం అయ్యారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి కొంతమంది కూలీలు ఫ్లెక్సీ కట్టడానికి పైకి ఎక్కారు. ఈ పరిస్థితిలో ప్రమాదవశాత్తు పై నుండి అరుణాచలం(35) కూలీ కిందపడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అరుణాచలంను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అరుణాచలం మృతి చెందినట్లు ఎస్ఐ రాజకుల్లయ్యప్ప తెలిపారు. మృతి చెందిన అరుణాచలం తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా సత్యమంగళం గ్రామంకు చెందిన వ్యక్తి అని, ఇతనికి భార్య, పిల్లలు వున్నట్లు తెలిపారు. ఫ్లెక్సీలు కట్టడానికి ఎలాంటి అనుమతి లేదని అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కాణిపాకంలో భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ

కాణిపాకం, జులై 24 (ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం జరిగిన సంకటహరచతుర్థి వ్రతం సందర్భంగా భక్తులకు ఆర్‌కె.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమును నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు బుధవారం జరిగిన సంకటహర చతుర్థి వ్రతం సందర ్భంగా వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. దీనితో భక్తుల సౌకర్యార్థం స్థానిక ఆర్‌కె.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమును నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదాన్ని అందించారు. ఆర్‌కె.చారిటబుల్‌ట్రస్ట్‌ఛైర్మన్‌ఆర్.రాజ్‌కుమార్,వారికుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు .

## మంచి ఆహారంతోనే ఆరోగ్యం

ద స్కూల్‌లో విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన

శ్రీకాళహస్తి, జులై 24 (ప్రభాతవార్త



పట్టణంలోని దస్కూల్‌లో బుధవారం 'ఫుడ్ ఫెస్టివల్' కార్యక్రమం నిర్వహించారు. కిండర్ గార్డెన్ విద్యార్థులచే ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు ప్రదర్శనను విద్యార్థులు అందరు తిలకించారు. ఈసందర్భంగా హెచ్ఎం విశాల మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్ది దశలోనే ఆహారపు అలవాట్లను గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బయట తయారు చేసి ఆహార పదార్థాలకు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని ఇంట్లో తయారు చేసిన ఆహారపదార్థాలను మాత్రమే తినాలని వివరించారు. విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకే ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీచ్ టూల్‌తో అత్యుత్తమ బోధన సాధ్యం

తొట్టంబేడు, జులై 24 (ప్రభాతవార్త



టీచ్ టూల్‌తో ఉపాధ్యాయులు అత్యు త్తమ బోధన అందించేందుకు సాధ్యమవు తుందని పుత్తూరు డివైఈవో ప్రభాకర్ రాజు అన్నారు. శ్రీకాళహస్తి పట్టటణం లోని ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశంలోని అన్ని విభాగాల ద్వారా నాణ్యమైన బోధన కొనసాగించేందుకు టీచ్ టూల్ పరిశీలన ఎంతగానోసహకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉపాధ్యాయయుల బోధనకు సంబంధించి సూచనలిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకుకున్న ఉపాధ్యాయులు యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ శివశంకరయ్య, డైట్ అధ్యాపకులు చెంగల్‌రాజు, రాష్ట్ర పరిశీలకులు విజయ, ఎంఈఓ భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిఎం రవికుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య, జులై 24, ప్రభాతవార్త



తిరుపతి నగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న శ్రీ గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాలలోని బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్‌లో గత 22 సంవత్సరాలుగా అధ్యాపకుడిగా పనిచేస్తున్న పిఎం రవికుమార్‌కి ప్రిస్ట్ యూనివర్శిటీ, తంజావూరు వారు ప్రొఫెసర్ టి. ప్రదీప్ పర్యవేక్షణలో ఎక్స్‌ప్లోరింగ్ ది మల్టీ ఫేసిటెడ్ మైక్రోబియల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ కాన్సర్ అండ్ యాంటీ డయాబెటిక్ యాక్టివిటీస్ అను అంశం పై డాక్టరేట్ పట్టాను ఇవ్వడం జరిగింది. వీరిని డిపార్ట్మెంట్, కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

## ఉప్పాల శివలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య, జులై 24, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని ఉప్పాల శివలక్ష్మికి విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వర్సిటీ ఆచార్యులు పి. రేణుక మార్గదర్శకత్వంలో స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంటరెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశం పై ఆమెకు డాక్టరేట్ లభించిందని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జీవన జ్యోతి తెలిపారు.

## త్రిబుల్ ఐటీకి ఎస్‌కే సిరీన్ ఎంపిక

తిరుపతి విద్య, జులై 24, ప్రభాతవార్త



తిరుపతి ఆటో నగర్ ఆర్‌జీ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇటీవల వెలువడిన త్రిబుల్ ఐటీ ఫలితాలలో పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్‌కే సిరీన్ నూజివీడు త్రిబుల్ ఐటీకి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు రవీంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థిని సెలెక్ట్ అవ్వడం పట్ల సంతోషంగా ఉందని, తరగతి ఉపాధ్యాయులు పివిఎల్ రమాదేవి, జయ చంద్రారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు షబానా, షేక్ షఫీ హర్షం తెలిపారు.

## ఎస్వీయూలో ఘనంగా నాన్ టీచింగ్

ఉద్యోగుల సంఘం నేతల ప్రమాణ స్వీకార మహోత్సవం

తిరుపతి విద్య, జులై 24, ప్రభాతవార్త




శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఈ నెల 11వ తేదిన జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా శ్రీధర్ గుర్రంకొండ, సెక్రటరీగా నెల్లూరు సుబ్రమణ్యం అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఎస్వియు సెనేట్ హాల్‌లో ఘనంగా అసోసియేషన్ నేతల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. అలాగే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని సెనేట్ హాల్‌లో ఉద్యోగుల ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పికే సుబ్రమణ్యం అలాగే జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య సమక్షంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్వియు మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్, భాస్కర్ రాయల్ ఎన్ఎంఆర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగదీష్, అలాగే కార్యదర్శి, హాస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సిబ్బంది రిటైర్ ఎంప్లాయిస్ అధ్యక్షులు కార్యదర్శి టౌం స్కేల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెక్రటరీ ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు శ్రీధర్ గుర్రంకొండ సుబ్రమణ్యం ప్రమాణ స్వీకారవచ్చిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంకట చతుర్థి హోమాలు: అభిషేకాలు

శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక ఆలయం వద్ద బుధవారం సంకట చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.బుధవారం చతుర్థి పూజలు రావటం ఓ ప్రత్యేకత అయితే 150 సంవత్సరాలకు ఒక సారి వచ్చే అరుదైనదిగా చెప్పబడుతుంది. కాబట్టి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో చతుర్థి పూజలు ఆలయం వరకే నిర్వహించే వారు.గతంలో పాలించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆలయంలో పలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే సంకటహర చతుర్థిని అర్జిత సేవగా మార్చారు.బుధవారం ఆలయంలోని మహిమాన్వితుడై అంజంజి వినాయక ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.ఆలయార్చకులు, వేదపండితులు కలశ స్థాపన గావించారు. ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఆలయ ఇన్స్‌పెక్టర్ నాగభూషణం,వేదపండితులుశ్రీవత్స వ,అర్చకులుఅనిల్‌శర్మ, పరిచారకులు రాజేశ్ శర్మ,లు నిర్వహించారు.

## ఎక్కడకెళ్ళాడో ఏమయ్యాడో?

ఏర్పేడు పోలీసులకు భార్య ఫిర్యాదు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 24 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం చింతలపాళెం పంచాయతీకి చెందిన జి.తిరుమల (35) నాలుగురోజుల నుంచి కనబడుటలేదని పోలీసులకు ఆతని భార్య సుజాత ఫిర్యాదు చేసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమల ఈ నెల 21న మార్కెట్‌కు వెళ్ళినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చేపను కొని తనకు అందించాడని అప్పటి నుంచి కనబడుట లేదని ఫిర్యాదు చేసింది. అయితే మూడు రోజుల పాటు తమ బంధువుల ఇళ్ళలో వాకబు చేసామని చుట్టుపక్కల వేదికామని వివరించారు.కానీ ప్రయోజనం లేదని మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు వివరించారు.ఈ మేరకు తాను ఫోన్ చేస్తున్నా తిరుమలయ్య ఫోన్ తీయటం లేదని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుష్ఠువ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సు

తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త



మండలంలోని కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తిరుపతి జిల్లా డిఎల్ఏటిఓ అధికారి డాక్టర్ఓ. శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా జిల్లా డిఎల్ఏటిఓ అధికారి డాక్టర్ఓ.శ్రీనివాసరెడ్డి వైద్యాదికారులు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లతో మాట్లాడుతూ కుష్ఠువ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోందని అంతేకాకుండా కొంతమందిని కబళిస్తోందని పేర్కొన్నారు. ఈక్రమంలోనే వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి సర్వేచేసి స్పర్శలేని మచ్చలు ఉన్నాయా లేవా అని గుర్తించాలన్నారు. అనంతరం చోడవరం గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటిని సందర్శించి సర్వేచేసి స్పర్శలేని మచ్చలు ఉన్నాయా లేవా అని గుర్తించడంతో పాటు అవగాహన కల్పించారు.అలాగే ఏటా పెరుగుతున్న ఈవ్యాధిని స్పర్శతో గుర్తించి చైతన్యంతో కళ్ళెం వేద్దామని ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధి లక్షణాలు బయటపడిన వెంటనే ఎవ్వరు కంగారు పడాల్సిన అవసరం లేదని వ్యాధిని తీవ్రతను బట్టి చికిత్స అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యాదికారి డాక్టర్ సి.శివకుమార్, డాక్టర్ ఈ.మాధవుడు, ఫిజియో తెఫిస్ట్‌డాక్టర్‌ఎస్వీ.రమణ,డిపిఎంఓ తిరుజ్ఞానమ్, జోబు, ఎపిహెచ్ఈఓ భాష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా

శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త



దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాష్ట్రం నుండే కాకుండా దేశం నలుమూలల నుండీ కూడా భక్తు లు విచ్చేస్తుంటారని, భక్తుల మనో భావాలు దెబ్బతినకుండా వుం డేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా వుంచినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు అన్నారు. పట్టణం లోని నాలుగు మాడావీధులు కమర్షియల్ ప్రాంతాలు. ఇక్కడ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ పర్యవవేక్షణ కొరవడటంతో మురుగునీటి కాలువలకు ముందు ఆక్రమణలు జరిగాయి. ఎక్కడ కాలువ ఉందో తెలియని స్థితి చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం వేకువ జాము నుంచి నగరి వీధిలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు వారి సిబ్బందితో కలసి కాలువలను శుభ్రం చేశారు.ఈ మేరకు బుధవారం ఉదయం 5 గంటల నుండే కమిషనర్ ఎం. రమేష్‌బాబు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇ.శ్రీనివాసులు పారిశుధ్యంపైప్రత్యేకదృష్టిసారించారు.కాలువల్లోపూడికలులేకుండాఎప్పటికప్పుడుచర్యలుతీసుకుంటున్నారు.

## మా బిడ్డను కాపాడండి..ఓ కార్మికుని ఆవేదన

శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త

మా బిడ్డను కాపాడేందుకు సాయం చేయడంని ఓ కార్మికుని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న దేవి, చిరంజీవులనాయుడు కుమార్తె హసిని(11) పట్టణంలోని ఓప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. తండ్రి శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీలో క్రేన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి దేవి గృహిణి. కుమార్తె హాసిని వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షలన్నీ నిర్వహించిన వైద్యులు చిన్నారికి లివర్ మార్పిడి చేయాలని చెప్పడంతో ఇందుకు రూ.25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తమకు అంతస్థోమత లేదని చెప్పడంతో వైద్యులు సాధ్యమైనంత వరకు తాము ప్రయత్నిస్తామని తెలిపారు. దాతలు స్పందించి తమ కుమార్తె వైద్యంకోసం ఆర్థికసాయం చేయాలని తండ్రి చిరంజీవినాయుడు కోరారు. దాతలు 9949017749 ఫోన్‌పే ద్వారా సంప్రదించి సాయం చేయాలని అర్థిస్తున్నాడు.

# తిరుపతి డివిజన్

## రేణిగుంట రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

అణువణువు గాలించిన పోలీసులు...

రేణిగుంట, జూలై 24 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, డివిజనల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, రైల్వే డీఎస్పీ షాను పర్యవేక్షణలో అర్బన్ సీఐ మల్లికార్జున్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు సీఐ సందీప్, రైల్వే ఎస్ఐ రవి తమ సిబ్బందితో బుధవారంసాయంత్రం రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేశారు. మాధక ద్రవ్యాలు, చిన్నపిల్లలు, మహిళల అక్రమ రవాణాను అరికట్టడానికి ఈ తనిఖీలను నిర్వహించారు. రైల్వేస్టేషన్ వెలుపల, రైల్వేస్టేషన్ నందలి బుకింగ్ కౌంటర్ల వద్ద, ఐదు ప్లాట్‌ఫాముల పైన వెయిటింగ్ రూముల్లో పరిశీలించారు. రేణిగుంటరైల్వేస్టేషన్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే అన్ని రైళ్ళలో నిశితంగా చెకింగ్ చేశారు. ప్రయాణికుల బ్యాగులను ఆమూలాగ్రం పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి, ఆకతాయిలను హెచ్చరించి బయటకు పంపించేశారు. ఈ సందర్భంగా సివిల్, రైల్వే పోలీసు అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాధక ద్రవ్యాలు, మద్యం, గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు రైళ్ళలో రవాణా చేయడం నిషేధించినట్లు తెలిపారు.నిషేధిత సామగ్రి కలిగి ఉన్నా, రవాణా చేసినా, వాటిని విక్రయించినా, సేవించినా చర్యలు కఠినంగా ఉంటాయనిహెచ్చరించారు.రవాణాచేస్తూపట్టుబడిన వారిపై కేసు నమోదు చేయడానికి వెనుకాడమన్నారు.

## పిల్లల్లో క్రీడా ప్రాముఖ్యతను తెలియజేయాలి

విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు

నారాయణవనం, జూలై 24 ప్రభాతవార్త :




పాఠశాల విద్యార్థుల్లో క్రీడా ప్రాముఖ్యతను తప్పక తెలియజేయాలని పుత్తూరు డిగ్రీ కళాశాల విశ్రాంతి వా య్యామ ఉపాధ్యాయులు రమేష్‌బాబు, సుధాకర్‌లు తెలిపారు. బుధవారం మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో శిక్ష సపా_హ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలో క్రీడలను నేర్పడం వల్ల వారు కూడా ఆరోగ్యంగాను, మెదడు కూడా బాగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మనోహరి, పిడి రాజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి సప్లై ఛానల్స్‌లో

ఆక్రమణలు తొలగించి....సరిహద్దులు గుర్తించండి

-నీటిపారుదల, ఆర్డీఓ, తాహశీల్దార్‌లకు గ్రామస్తులు ఫిర్యాదు

-స్వర్ణముఖీ సప్లై ఛానల్స్ ఆక్రమణలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, జూలై 24 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ చెరువుకు వచ్చే సప్లై ఛానల్స్ ఆక్రమణకు గురైనాయని, ఆక్రమణలు తొలగించి, సప్లై ఛానల్స్ హద్దులను గుర్తించి, చెరువుకు వచ్చే సప్లై ఛానల్స్‌ను పునరుద్ధరించాలని టిడిపి యువనాయకుడు శివారెడ్డి డిమాండ్ చేసారు. కళ్యాణ డ్యామ్ నిండితే గేట్లు తెరిస్తే ముందుగా పాతకాల్వ చెరువు నీళ్ళు వస్తాయని, ఆ తర్వాతే పేరూరు, రామానుజపల్లి, గొల్లపల్లి, తుమ్మలగుంట, అవిలాల తదితర చెరువుకు నీళ్ళు వెళతాయని తెలిపారు. స్వర్ణముఖీ నుండి పాతకాల్వ చెరువుకు వచ్చే కాల్వల్లో ఆక్రమణలు తొలగించి, కాల్వల్లో పూడిక తీయించి, కాల్వ హద్దులు గుర్తించాలని కోరారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ అధికారులకు, ఆర్డీఓకు, తిరుపతిరూరల్ తహశీల్ధార్‌కు సప్లై ఛానల్స్ ఆక్రమణపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాతకాల్వ చెరువుకు వచ్చే కాల్వల ఆక్రమణలపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అసెంబ్లీలో ప్రస్తావించారని ఈ సందర్భంగా మీడియాకు శివారెడ్డి తెలియజేసారు. పాతకాల్వ చెరువుకు వచ్చే సప్లై ఛానల్స్ ఆక్రమణకు గురైనట్లు నీటిపారుదల శాఖ ఇంజనీర్ తెలియజేసారని, సప్లై ఛానల్ సరిహద్దులను గుర్తించటానికి మండల సర్వేయర్ ఏర్పాటు చేయాలని తహశీల్ధార్‌ను కోరినట్లు తెలిపారు. రాబోవు వర్షాకాలంలో పాతకాల్వ చెరువు నిండాలంటే కాల్వల్లో ఆక్రమణలు తొలగించి, పూడిక తీయించాలని కోరారు.

## వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, జూలై 24 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు వినాయకస్వామి ఆలయాల్లో బుధవారం సాయంత్రం సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు ప్రత్యేక హోమాలు, అర్చనలు ప్రత్యేక పుష్పాలు అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని బెస్త వీధిలోని శ్రీ తరుణ గణపతి జెండామాను వీధిలోని సెల్వ గణపతి, బజారు వీధిలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, తొరూరు గ్రామంలోని వినాయకస్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## అన్నమాచార్యలో స్వయం ప్రతిపత్తి పై ప్రత్యేక కార్యక్రమం

రేణిగుంట, జూలై 24 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఓరియంటేషన్(స్వయం ప్రతిపత్తి) కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు కళాశాల పరిసరాలను, అధ్యాపకులను, ప్రధానాచార్యులను, విద్యా నియామ నిబంధనలను, క్రమశిక్షణతో కూడిన బాధ్యతలను కళాశాల యాజమాన్యం తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి ఐఐటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య, క్రీడలు, ఇంటర్వ్యూల కోసం తర్ఫీదు తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అవలంభిస్తూ పోటీతత్వం పెంచుకుని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల గౌరవ కార్యదర్శి, కరస్పాండెంట్ డా. గంగిరెడ్డి విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా. నాధమునిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యా సంవత్సరం నియామ నిబంధనలను వివరించారు. ఏ స్టోరీ ఆఫ్ ఏ బెలూన్, శాండల్ ట్రీ-స్నేక్ అంశాల ఉదాహరణలతో వైఖరుల యొక్క ప్రాముఖ్యతను విశదీకరించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. మురుగేషన్, ఐక్యుఏసీ కో-ఆర్డినేటర్ డా. రమ్య, డా. రామచంద్ర, విద్యాసంస్థ హెచ్‌వోడీలు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహక నగదు బహుమతులు

కళాశాల, తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలు పెంచాలి..!

వ్యాపారవేత్త పి.లక్ష్మీనాధ్ రెడ్డి

చంద్రగిరి, జూలై 24 ప్రభాతవార్త:



స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో మొదటి (2023-2024) సంవత్సరం ఫలితాలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు బుధవారం తొండవాడకు చెందిన వ్యాపారవేత్త పి.లక్ష్మీనాధ్ రెడ్డి ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసి అభినందించారు. శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం దివంగత పి.లక్ష్మణ రెడ్డి తనయుడు లక్ష్మీనాధ్ రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం మొదటి స్థానంలో నిలిచిన 7 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.1500/-లు వంతున రూ.10,500/-లు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన 7 మందికి ఒక్కొక్కరికి రూ.1000/-లు వంతున రూ.7000/-లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అద్భుతమైన ప్రతిభతో రాణించి ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించాలన్నారు. తద్వారా కళాశాలకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, పాల్గొన్నారు.

## మా తల్లిదండ్రుల సమాధులను నేలమట్టం చేశారు..!

బాధితుడు వెంకటముని ఆవేదన

రామచంద్రాపురం, జూలై 24 ప్రభాతవార్త:



మా తల్లిదండ్రుల సమాధులను నేలమట్టం చేసి ఆక్రమించుకున్నారని సొరకాయలపాళ్యం గ్రామానికి చెందిన వెంకటముని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మీడియా కేంద్రంలో ఆయన తన సమీప బంధువు మధుతో కలసి విలేకరుల ఎదుట తమ కష్టాన్ని వెళ్ళబోసుకున్నాడు. గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు గిరిబాబు, సుబ్రమణ్యం కుమార్తె మునెమ్మ తన తల్లిదండ్రుల సమాధులను రాత్రికి రాత్రే నేలమట్టం చేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు తెలిపారు. సొరకాయలపాళ్యం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నం. 130/3లో 64 సెంట్లు భూమి తమకు తల్లిదండ్రుల నుండి వారసత్వంగా సంక్రమించిందన్నారు. సదరు భూమిలో కొంత భాగం అక్రమంగా రికార్డులు సృష్టించుకుని ఈ భూమి తమదంటూ తమపై దౌర్జన్యం చేస్తున్నట్లు వాపోయారు. తాము అనేక పర్యాయాలు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ స్పందించలేదన్నారు.

# కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం

**- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి - కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో తప్పక గుర్తింపు !**

కుప్పం, జూలై 24 ప్రభాతవార్త : కార్యకర్తలు లేకుంటే తాము లేమని ఈరోజు కార్యకర్తల కృషితోనే తాము ఉన్నామని పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం పిఇఎస్ ఆడిటోరియంలో కుప్పం మున్సిపల్ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాలు ఎదుర్కొన్న కార్యకర్తలకు తప్పక పార్టీలో గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎంతో మంది తెదేపా కార్యకర్తలు కేసులు ఎదుర్కోవడంతో పాటు పలుచోట్ల ప్రాణాలు పార్టీ కోసం పణ ంగా పెట్టారన్నారు. లీడర్లు ఉన్నా లేకున్నా కార్యకర్తలు జెండాలు మోశారన్నారు. నందంసుబ్బయ్య, తోట చంద్రయ్యలు వైకాపాకు జై కొట్టలేదని వైకాపా పాలనలో పీకకోసి చంపేశారన్నారు. తాను నిజ ం గెలవాలి కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశానంటే అది కుప్పం ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఇచ్చిన ధైర్యమేనన్నారు. ఈ కార్యక్రమం చేపట్టే సమయంలో కార్యకర్తలు ఇచ్చిన ప్రోత్సా హంతో విజయవంతంగా పూర్తి చేశానన్నారు. కుప్పంకు సిఎం చంద్రబాబు 250 కోట్లు మంజూరు చేశారన్నారు. కుప్పం ప్రజలకు ప్రత్యేక మేనిఫెస్టో అమలు చేస్తారన్నారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ కుప్పంలో ఎమ్మెల్సీ డా౹౹ కంచర్ల శ్రీకాంత్ యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహించారని, పెద్దిరెడ్డి ప్రయత్నాలు తిప్పికొట్టేలా తమను ముందుకు నడిపించారని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని, పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కుప్పంలో చంద్రబాబును ఓడించాలని ప్రయత్నించాడని కుప్పం కార్యకర్తలపై అక్రమంగా హత్యాయత్నం కేసులు పెట్టి బెదిరించారన్నారు. కుప్పంను నారా వారి కుప్పంగా నిలబెట్టేందుకు తాము పోరాడతామ న్నారు. తమను ఇబ్బందులకు గురిచేసిన వారిని పార్టీలో చేర్చు కుంటున్నారు అనే వార్తలు వస్తున్నాయని వాటిపై అధిష్టానం దృష్టి సారించాలని కోరారు. కుప్పంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి యువతకు భవిష్యత్తు చూపాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా౹౹ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు ఖాదర్ బాషా, రాష్ట్ర నేతలు డా౹౹ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా౹౹ వెంకటేష్, సత్యేంద్రశేఖర్,ఆర్ముగం, కన్నన్, ప్రతాప్, ఆర్ఆర్ రవి, మంజు,రవి, వేణు, నబి, కౌన్సిలర్లు దాము, సోమశేఖర్, జాకీర్, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, అనసూయ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

## రికార్డుస్థాయిలో శివయ్య హుండీ రాబడి



శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి ఏ నెలకానెల పెరుగుతుంది. ఇటీవల ఆలయంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సుమారు నెల రోజుల పాటు ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజల్లో 'సంభావనలకు' స్వస్తి చెప్పారు.దాంతో ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు తమ మొక్కుబడులను హుండీల్లో సమర్పించారని చెప్పవచ్చు.అంతేకాక దళారి వ్యవస్థను కట్టడి చేయటంతో టిక్కెట్లు అమ్మకాల ద్వారా ఆదాయాలు కూడా పెరిగాయి.సాధారణంగా నెలకు రూ.1.5కోటి వరకు వచ్చే ఆదాయం ఈ సారి 35 రోజులకు అమాంతం కోటి రూపాయలు పెరిగింది. అంటే దళారులు, అర్చకుల జేబుల్లో వెళ్ళె సొమ్ములు శివయ్య హుండీలో పడ్డాయని చెప్పవచ్చు. బుధవారం స్వామి అమ్మవార్ల వద్ద ఉన్న హుండీలను లెక్కించారు. హుండీల్లో కరెన్సి రూ.2కోట్ల 23లక్షల 73వేల 531లు వచ్చింది. ఇది రికార్డు స్థాయి హుండీ ఆదాయం అని చెప్పవచ్చు. ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తంలో రాలేదు. ఇకబంగారు ఆభరణాలు 000.124.400 గ్రాములు వచ్చింది. ఇక నాగపడగల ద్వారా వెండి 677.400కిలోలు వచ్చింది. ఇక అమెరికా డాలర్లు 101 రాగా మలేషియాకు సంబంధించిన కరెన్సి 47 సింగపూర్ కరెన్సి 10నోట్లు శ్రీలంక కరెన్సి 11 ఇతర దేశాలకు సంబంధించి 14 నోట్లు వచ్చాయి.ఈ లెక్కింపుల్లో ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎన్‌వియస్‌ఎన్ మూర్తి,ఎసి మల్లికార్జున్ ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీవర్‌సర్వే..కంటి సమస్యల సర్వేను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**

కుప్పం, జూలై 24 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో ఆగస్టు పదవతేది లోగా కంటి సమస్యల సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో కంటివెలుగు, ఫీవర్ సర్వేలపై కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19నుంచి చేపట్టిన ఇంటింటి సర్వేలో ఏ కారణంతో అయినా కంటిచూపు లేకుంటే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించిన అనంతరం వారికి ప్రిలిమనరీ స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించి ఆపరేషన్ల విషయం నిర్ధారించడం జరుగుతుందన్నారు. కుప్పం, చిత్తూరు, తిరుపతిలో ఎక్కడ ఆపరేషన్లు చేయాలో నిర్ణయిస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు చక్కెర వ్యాధి గ్రస్తులైతే వారు సకాలంలో మందులు వేసుకునేలా చూడాలని ఎఎన్‌ఎంలకు సూచించారు. ప్రతి ఎఎన్‌ఎం తమ పరిధిలో ఉన్న గర్భవతుల వివరాలు మూడు నెలల్లోపే నమోదు చేయాలన్నారు. గర్భవతులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచడంతో పాటు ప్రసవం అనంతరం నలభై రోజులు తల్లిబిడ్డల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కుప్పం పిఇఎస్ఖ్ ఆస్పత్రిలో జరుగుతున్న రీతిలోనే కుప్పం ఏరియా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించాలని ఎంఎస్ విజయకుమారిని ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో అనస్తీషియా డాక్టరు మూడు రోజులు అందుబాటులో ఉంటారని వివిధ రకాల సర్జరీలను మూడు రోజుల్లో నిర్వహిస్తామని ఆమె కలెక్టరుకు తెలిపారు. ఆరోగ్యశ్రీ ఉన్నా లేకున్నా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని వివరించారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ నారపురెడ్డి మౌర్య



తిరుపతి కార్పొరేషన్, జూలై 24 ప్రభాతవవార్త : జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ని నగర పాలక కమిషనర్ నారపురెడ్డి మౌర్య మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను కలెక్టర్ సాదరంగా స్వాగతం పలికారు.

## మహిళపైకి దూసుకెళ్లిన లారీ-అక్కడక్కడే దుర్మరణం



నారాయణవనం, జూలై 24 ప్రభాతవార్త : పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం ఐయ్యావారికండ్రిగ వద్ద బుధవారం ఉదయం 6.30గంటలకు రోడ్డుకు పక్కన నడిచి వెళుతున్న ఓ మహిళపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో ఆమె అక్కడక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా వున్నాయి. నిండ్ర మండలం ఐయ్యావారికండ్రిగ చెందిన లేట్ భాస్కర్‌రెడ్డి భార్య బి.మల్లీశ్వరీ(56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె ఇద్దరు కుమారులు బయట వుండడంతో వ్యవసాయ పొలంలో పనులు చేయించుకోవడం కూలీల కోసం మల్లీశ్వరీ నారాయణవనం మండలం నైనారుకండ్రిగ దళితవాడ వద్దకు బుధవారం ఉదయం నడిచి వచ్చే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఆమెపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె తల, శరీర భాగాలు నుజు అయ్యింది. మృతురాలు అన్న రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పంచనామా చేసిన తర్వాత బంధువులకు అప్పగించారు. లారీతో పాటు డ్రైవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కన్నుల పండువగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పార్వేట ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అర్జునుడు,ద్రౌపదీదేవి ఉత్స వ విగ్రహాలను గ్రామోత్స వంగా సాగిం చారు. మేళ తాళాలతో పాటు తప్పెట్లు మోతతో గ్రామోత్స వం సాగింది. జ్ఞానమ్మ కండ్రిగ కొత్త కండ్రిగలకు తీసుకెళ్ళారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు జరిపారు. హారతులిచ్చారు. ఏడాదిలో ఒకే ఒక రోజు వచ్చే స్వామి అమ్మవార్ల రాక సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం కల్పించారు. ఊరంతా ముగ్గులు వేసారు.మామిడి తోరణాలతో ముస్తాబు చేసారు. స్వామి అమ్మవార్ల రాకసందర్భంగా యువకులు భారీ ఎత్తున బాణ సంచా కాల్చి స్వాగతం పలికారు. ఉత్స వాలతో పాటు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్ వెంటరాగా ఉత్స వం కన్నుల పండువగా సాగింది.సాయంత్రం స్వామి అమ్మవార్లను పాతవరదయ్యపాళెం రోడ్డు మీదుగా ఆలయానికి చేరింది.

## ద్రవిడ వర్సిటీకి కొత్తవెబ్‌సైట్ ప్రారంభం

కుప్పం, జూలై 24 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయం యొక్క నూతన వెబ్‌సైట్‌ను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి ప్రారంభించారు. వర్సిటీ ఇప్పుడు ప్రపంచవ్యాప్త దృష్టిని సారిస్తుందని ఇది గొప్ప ముందడుగు అని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ డైనమిక్ వెబ్‌సైట్ విద్యార్థులకు, పరిశోధకులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. నాక్ కోసం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ద్రవిడియన్ యూనివర్సిటీ.ఎసి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో వర్సిటీ మొత్తం డేటా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డా౹౹ రాజేశ్వర్‌రెడ్డి, డీన్లు, హెచ్ఓడిలు పాల్గొన్నారు.అంతకుముందు వర్సిటీలో బిసిజి టీకాల కార్యక్రమంను నిర్వహించారు.

## అమరావతికై యాభైవేల చెక్కు నారా భువనేశ్వరికి అందజేత



కుప్పంరూరల్, జూలై 24 ప్రభాతవార్త : రాజధాని అమరావతి నగర నిర్మాణంకు గాను తమవంతుగా మండలంలోని పైపాళ్యం పంచాయతీ మాజీ సర్పంచ్ సికె సుబ్రమణ్యం, కాంట్రాక్టర్, తెదేపా యువనేత సికె విజయ్‌కుమార్ కుటుంబీకులు యాభైవేల రూపాయల విరాళాన్ని అందించారు. ఈమేరకు చెక్కును బుధవారం సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి అంద జేశారు. నారా భువనమ్మ సికె సుబ్రమణ్యం కుటుంబీకులను అభినందించారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణంకు విరాళ ం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాగా తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడం పట్ల నారా భువనమ్మకు మాజీ సర్పంచ్ సికె సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహార గణపతివ్రతం

కాణిపాకం, జూలై 24 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహార గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహార చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది.రికార్డు స్థాయిలో సంకటహార వ్రతంకు 717 టిక్కెట్లు తీసుకుని వ్రతాన్ని ఆచరించారు. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, రవి, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మకు బంగారు నేత్రాలు బహూకరణ



సూళ్లూరుపేట, జూలై 24 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవికి భక్తులు బుధవారం 8 గ్రాముల బరువు గల బంగారు నేత్రాలను బహూకరించారు. సూళ్లూరుపేటకు చెందిన ఆములూరు ప్రతాప్‌నాయుడు, సుజాతమ్మ దంపతులు అమ్మణ్ణికి మొక్కుబడి తీర్చుకునే ప్రక్రియలో భాగంగా ఈ నేత్రాలను ఆలయ సిబ్బంది ద్వారా సమర్పించారు. తమ కోర్కెలు తీర్చే కల్పవల్లిగా శ్రీచెంగాళమ్మను స్మరించుకుంటూ భక్తితో ఈ చిరు కానుకను అమ్మవారికి సమర్పించినట్లు వారు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రేణిగుంట, జూలై 24 ప్రభాతవార్త : రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి రోడ్డు దాటుతున్న సింగనమల రమేష్ (50) వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. నంద్యాకు చెందిన రమేష్ రేణిగుంట నందు ఓ హోటల్ నందు పనిచేస్తాడు. సాయంత్రం విధులు ముగించుకొని మద్య దుకాణాన్నికి వెళ్ళి మద్యం బాటిల్స్ కొనుక్కొన్ని మెట్లపై నుండి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కి, బ్రిడ్జి దాటుతుండగా ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో రమేష్ మృతి చెందాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న చోదకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితి వెళ్ళడంతో అతని వివరాలు తెలిలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జాగిలాల పనితీరును పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ ఎస్పి



తిరుపతి కార్పొరేషన్, జూలై 24 ప్రభాతవార్త : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు జాగిలాల పనితీరును బుధవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ పరిశీలించారు. హంటర్, గంగ పేర్లు గల ఈ జాగిలాలు టాస్క్‌ఫోర్సు కార్యాలయం ప్రాంగణంలో తమ పని తీరును ప్రదర్శించాయి. ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు ఈ జాగిలాల సేవలను కూడా అదనంగా వినియోగించడం పై దృష్టి సారిస్తామని ఎస్పి తెలిపారు. టాస్క్‌ఫోర్సుకు ఐదు జాగిలాలు ఉన్నాయని, రెండు తిరుపతిలోనూ, మిగిలిన మూడు కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్‌లలో ఉపయోగిస్తున్నామన్నారు. అనుమానిత చెక్ పోస్టులతో పాటు, అటవీ ప్రాంతాల వైపు ప్రయాణించే వాహనాలను జాగిలాల ద్వారా తనిఖీ చేయను న్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో డంప్‌లను ఏర్పాటు చేసి ఉంటారని, వీటిని జాగిలాలు వెంటనే కనుగొనే పరిస్థితి ఉంటుందని అన్నారు. గతంలో కూడా జాగిలాల సేవలను వినియోగించుకున్న విషయం తెలిసిందేనని, అదే తీరులో మళ్లీ తాజాగా జాగిలాలను ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. ప్రయోగాత్మ కంగా టాస్క్‌ఫోర్సు కార్యాలయం ప్రాంగణంలో జాగిలాల పనితీరును పరిశీలించగా, అవి విజయవంతంగా పని చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, జాగిలాల ట్రైనర్లు పాల్గొన్నారు.

## వాటంబేడులో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



తడ, జూలై 24 ప్రభాతవార్త : తడ మండలం వాటంబేడులో బుధవారం గ్రామదేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠను సాంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. గ్రామపెద్దలు, యువకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాటంబేడు గ్రామం ఒక మారుమూల ఉన్నప్పటికీ ఇక్కడ గ్రామస్థులు చొరవ తీసుకొని పలు ఆలయాలను నిర్మించి ప్రత్యేక పూజలు జరుపుతుండటం ఆనవాయితీగా మారింది. తాజాగా పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామదేవతను మహిళలు కొలువులు, నిత్య పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

## గంజాయి, మత్తుపదార్ధాల సరఫరాను అరికట్టాలి

**- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్**



చిట్టమూరు, జూలై 24 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గంలో రౌడీయిజం, గంజాయి, మత్తుపదార్ధాల సరఫరాను అరికట్టడంతో పాటు లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని హోంమినిస్టర్ వంగలపూడి అనితను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హోమ్ మినిస్టర్ ఛాంబర్‌లో హోంమినిస్టర్ వంగలపూడి అనితను కలిని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గూడూరు నియోజకవర్గంలో రౌడీయిజం, గంజాయి, మత్తుపదార్ధాల సరఫరా ఎక్కువైనట్లు ఆరోపించారు. దాంతో పాటు లా అండ్ ఆర్డర్ గాడితప్పిందని పేర్కొన్నారు. పలు సమస్యలపై హోంమినిస్టర్‌కు విన్నవించామని ఆయన చెప్పారు. అన్ని సమస్యల పరిష్కారానికి హోంమినిస్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు.

## ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం - వార్త ప్రభావం



పాకాల, జూలై 24, ప్రభాతవార్త : పాకాల మండలంలోని పాకాల రైల్వే బ్రిడ్జి నుంచి ఊట్లవారిపల్లె మీదుగా గుమ్మడి వారి ఇల్లు వరకు రోడ్డు మరమ్మతు చేయవల్సి ందిగా జూన్ నెల 27 తేది వార్త ప్రతికలో కథనం వచ్చింది. దీనిపై స్పందిచిన ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రోడ్డు నిర్మాణం చేస్తుండడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మేయర్ డాక్టర్ శిరీషని కలిసిన కమిషనర్ మౌర్య



తిరుపతి కార్పొరేషన్, జూలై 24 ప్రభాతవార్త : తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషని బుధవారం తాతనగర్‌లో వైష్ణవి హాస్పిటల్‌లో కలిసారు. మేయర్ డాక్టర్ శిరీష సాధర స్వాగతం పలికారు. కమిషనర్‌కి అభినందనలు తెలిపారు.

## అన్నం రుచిగా ఉండేందుకు నాణ్యమైన బియ్యం పంపండి

**-రైస్‌మిల్లర్లతో ఈఓ శ్యామలరావు**



తిరుమల,జులై 24ప్రభాతవార్త : శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన భక్తులకు నిరంతరాయంగా వడ్డిస్తున్న అన్నప్రసాదాలు మరింత రుచిగా ఉండేందుకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని రైస్‌మిల్లర్లను టిటిడి ఈఓ జె.శ్యామలరావు కోరారు. అన్నప్రసాదాలు రచిగా ఉండాలంటే నాణ్యమైన బియ్యం అవసరమన్నారు. బుధవారం ఉదయం టిటిడి పరిపాలన భవనంలో సమావేశమందిరంలో టిటిడికి బియ్యం సరఫరా చేస్తున్న రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. టెండర్లు పిలిచే సమయానికి మరింత నాణ్యత బియ్యం పంపాలని కోరారు.

## సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కేంద్రాల తనిఖీ



తిరుపతిలో భక్తులకు జారీచేసే టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జెఈఓ గౌతమి.అధికారులకు సూచనలు

ప్రభాతవార్త-తిరుపతి

## మైసూరు మహారాజు పల్లవోత్సవంలో మలయప్ప



తిరుమలలో పల్లవోత్స వంలో మైసూరు మహారాజు కుటుంబం పాల్గొని స్వామివారి సేవలోతరించారు.

ప్రభాతవార్త-తిరుమల

## అడిక్కృత్తిక మహోత్సవాలకు అంకురార్పణ



శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్స వం.పండగ వాతావరణం, ఆధ్యాత్మిక సంబరాలు. బుధవారం వరకు ద్రౌపదీసమేత ధర్మరాజుల ఉత్స వాలతో కళ కళ లాడగా బుధవారం రాత్రి నుంచి ఆడికృత్తిక మహోత్స వాలకు అంకురార్పణ గావించారు.ఆడికృత్తిక మహోత్స వాలను ఆలయంలోని చెంగల్వరాయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్స వాలుగాను, ఆలయానికి అనుబంధంగా విజ్ఞాన గిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్స వాలుగా నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో బుధవారం రాత్రి చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద ఆలయ ప్రదానార్చకులు డాక్టర్ స్వామినాధ్‌న్ గురుకుల్ పర్యవేక్షణలో బ్రహ్మోత్స వాలకు అంకురార్పణ పూజలు నిర్వహించారు.ఆలయ కార్యనిర్వహాణాధికారి ఎన్‌వియస్‌ఎన్ మూర్తి పర్యవేక్షణలో అంకుర్వారణ హోమాలు నిర్వహించారు. గురువారం ధ్వజారోహణం నిర్వహించనున్నారు.ఆలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై ఆడికృత్తిక ఉత్స వాలు పూర్తిగా చుట్టుపక్కల గ్రామాల జనానికి సంబంధించినదిగా నిర్వహిస్తారు. ఆడికృత్తిక పర్వదినాన కనీసం లక్ష మంది భక్తులు కొండపైకి వెళ్ళి స్వామి వారిని దర్శించుకుంటారు. నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా ఉత్స వాలు నిర్వహిస్తారు.ఈ నేపధ్యంలో ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్నారు.బుధవారం రాత్రి చెంగల్వరాయ స్వామి ఆలయం ఎదురుగా అంకుర్వారణకు హోమాలు ఏర్పాటు చేసారు.ఆలయ పొరోహితులు అర్ధగిరి స్వామి సారధ్యంలో వేదపండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,కరుణాకర్ గురుకుల్‌ల పర్యవేక్షణలో అంకుర్వారణ జరిగింది.

## జనరిక్ మెడికల్ షాపులను పరిశీలించిన బిజేపి బృందం

తిరుపతి హెల్త్, జూలై 24 ప్రభాతవార్త : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజలకి ఆరోగ్యపరంగా ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో దేశంలోనే అనేక ప్రదేశాలలో ప్రధానమంత్రి భారతీయ ఔషధ జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రాయలసీమకే తలమానికమైన తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో గల ఔషద జనరిక్ మందులు కాకుండా ఇతర మందులను అమ్ముతున్నారని ప్రజల ఫిర్యాదు మేరకు బిజేపి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఔషధ జనరిక్ మందులు అమ్మకుండా అధిక ధరలు గల మెడిసిన్ అమ్ముతూ పేద ప్రజలు నడ్డి విరుస్తున్నారని, దీనిపైన విచారణ చేయాలని స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్‌కి తెలపగా సానుకూలంగా స్పందించి జనరిక్ మెడికల్ షాపు మీద విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. వారంలోగా ఆ షాపు రద్దు చేయకపోతే తాము పై అధికారులకు తెలియజేసి చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి, బిజేపి తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్, బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి టిడి వరప్రసాద్, బిజేపి జిల్లా కార్యదర్శి డాక్టర్ల్ నరేష్, బిజేపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండేటి ప్రేమ్ కుమార్, బిజేపి నాయకులు, బాలభాస్కర్, హేమ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూశాఖలో 'అక్రమార్కునికి' అందలం!

**-డిఆర్ఓ తొలగించమంటే ఆర్డీవో కార్యాలయంలో అవకాశం**

శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త : రెవెన్యూశాఖలో ఎన్ని అక్రమాలు, అవకతవకలు, అవినీతి చేస్తే అంత అందలం ఎక్కిస్తారనడానికి ఎన్నో ఉదాహరణలు. శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాల యంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనం. కెవిబిపురం మండలంలోని గ్రామాల్లో రికార్డులను తారుమారు చేసిన అతన్ని విధులనుంచి తొలగించమని అప్పటి డిఆర్ఓ మురళీ హయాంలో ఆదేశాలు జారీచేసినా ఆఉద్యోగి ఇంకా రెవెన్యూశాఖలోనే కొనసాగుతున్నాడంటే ఆశాఖ పనితీరుకు అవినీతి పరులను అందలం ఎక్కిస్తారనడానికి చక్కటి ఉదాహరణ. వివరాల్లోకి వెళితే.. కెవిబిపురం మండలం కొండల్లో ఆదవరానికి చెందిన డి.అజయ్‌కుమార్ 2020లో కెవిబిపురంలో తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఇక్కడి రెవెన్యూ పరిధిలోని సిద్దమనాయుడు కండ్రిగ రెవెన్యూ సర్వేనంబర్ 80మరియు 79/5లో ఉన్న భూములను ఇతరులు పేరుపై మార్చి వేయడంతో దీనిపై బాధితులు ఉన్నతాధికారులకు తెలిజేయడంతో వారు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టడంతో అజయ్ కుమార్ అవకత వకలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు అతన్ని విధుల నుంచి తొలగించాలని 21.06.2021న ఆదేశాలు జారీ చేశారు. అయితే కెవిబిపురం మండలం నుంచి శ్రీకాళహస్తిలోని తహశీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో వెబ్‌ల్యాండ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా తొలగించాలని అప్పటి డిఆర్ఓ మురళీ ఆదేశాలు జారీ చేసినా విధుల నుంచి తొలగించకుండా ఇటు శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలోను, అటు ఆర్డీవో కార్యాలయం లోను విధులు నిర్వహిస్తూన్నాడు. అయితే తిరిగి తహశీల్దార్ కార్యాలయంలోనే పనిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల తీరు అందరికీ తెలిసిందే. అక్రమార్కులకు కార్యాలయంలో అవకాశం కల్పిస్తే అవినీతికి అందలం ఎక్కించట్లే అవుతుందని పలువురు విమర్శిస్తున్నారు.



Roc. A3/E- 341750/2021, dt. 21/06/2021

PROCEEDINGS

Sub:- Public Services - Chittoor District - Vigilance Report ... about the irregular transfer of ownership of Assigned Lands in Sy.No.80 & 79/... Siddammanaidu kandriga village of K.V.B. Puram Mandal - discontinued the services of Sri.D.Ajay Kumar, Data Entry Operator with immediate effect - reg.

Read:- Govt. Memo.No. REV01-LANA0CCLV(DISC)/15/2021 ... dt.19.04.2021.

ORDER:

The Government in their memo read above, have informed to take necessary action to discontinue the services of Sri.D.Ajay Kumar, Data Entry Operator with immediate effect.

In pursuance of the orders issued by the Government in the reference read above, the services of Sri.D.Ajay Kumar, Data Entry Operator is discontinued with immediate effect.

The Tahsildar, Srikalahasti is hereby directed to discontinue the services of the individual and report compliance immediately.

(UNDER ORDERS OF THE DISTRICT COLLECTOR, CHITTOOR)

M S Murali
District Revenue Officer
CHITTOOR

To
Sri.D.Ajay Kumar, Data Entry Operator through the Tahsildar, Srikalahasti
Copy to the Executive Director, APCOS, 2nd Floor, APSRTC Administrative Block, ... Station, A.P., Vijayawada.
Copy to the Tahsildar, Srikalahasti K.V.B.Puram Mandal.
Copy to the Revenue Divisional Officer, Tirupati

విధుల నుంచి తొలగిస్తూ అప్పటి డిఆర్ఓ ఇచ్చిన కాపీ